ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 05-11-2026 సమయం : **6.45** గంటలు

ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు మరికొద్దిసేపట్లో పోలింగ్ ప్రారంభం కానుంది.

2. రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రవాహాలపై అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

3. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికలకు పటిష్ఠ పోలీసు భద్రత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు.

4. తెలంగాణలో 47 లక్షలకు పైగా అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

==========

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పోలింగ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. మొత్తం 31 వేల 460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో మొత్తం 9 వేల 821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2 వేల 51 స్థానాలు ఏకగ్రీవమవ్వగా.. మిగిలిన 7 వేల 770 స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అలాగే 659 జడ్పీటీసీ స్థానాల్లో 77 ఏకగ్రీవం అవగా, మిగిలిన 582 స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఇందులో భాగంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని కొన్ని మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురం మండలంలో పూర్తిగా పోలింగ్ వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠా వెల్లడించారు. రెండు జిల్లాల కలెక్టర్ల విజ్ఞప్తుల మేరకు పరిస్థితులను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈరోజు జరగాల్సిన పోలింగ్‌ను రేపు నిర్వహించనున్నారు. శనివారం ఓట్ల లెక్కింపు

చేపట్టనున్నారు. ఈ మండలాలు మినహా ఆయా జిల్లాలలోని మిగిలిన ప్రాంతాల్లో ఈరోజు యథావిధిగా పోలింగ్ కొనసాగుతుందని ఎన్నికల సంఘం తెలిపింది.

రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రవాహాలపై అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకల కారణంగా వివిధ రహదారి మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అదేవిధంగా చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వరద పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల గిరిజనులను ఓటు హక్కు వినియోగించుకోకుండా ఒడిశా అధికారులు అడ్డుకోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మంత్రి నిన్న ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 29 గిరిజన గ్రామాల ప్రజలను ఎన్నికలు బహిష్కరించాలని బెదిరించడం తగదన్నారు. ఓటు వేయడానికి వస్తారనే కారణంతో ఆంక్షలు విధించడం, గిరిజనుల వాహనాలను స్వాధీనం చేసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. కొఠియా గ్రామాలపై సుప్రీంకోర్టు స్టేటస్ కో అమల్లో ఉందని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. 2026 ఆగస్టు 14 నాటికి తెలంగాణలో 47 లక్షల 21 వేల 780 మందికి పైగా అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిన్న వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో 3 లక్షల 84 వేల 770 మందికి పైగా కార్మికులు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ-శ్రామ్ కార్డుదారులకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రమాదవశాత్తు మరణిస్తే రెండు లక్షల రూపాయలు, పాక్షిక వైకల్యం ఏర్పడితే లక్ష రూపాయల బీమా కవరేజీ లభిస్తుందని వివరించారు.అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో ఈ-శ్రమ్ కీలకంగా మారిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ పోలీసు భద్రత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో, పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు తగినంత మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల

వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని డీజీపీ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ లో తుపాను సహాయక చర్యలపై హోంమంత్రి వి.అనిత నిన్న సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో శ్రవణ మాధ్యమం విధానం ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తుపాను బాధితులకు త్వరితగతిన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. మురసు తుపాను ప్రభావిత ఏడు జిల్లాల్లోని గ్రామాల్లో సహాయక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

తూర్పు తెలంగాణ, పరిసర కోస్తాంధ్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలహీనపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తాంధ్ర, రాయలసీమలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈరోజు కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి సి.హెచ్ నాగభూషణం తెలియజేస్తూ...

వాయిస్ ..25.. సెకన్లు

ప్రపంచంలోని ప్రముఖ పర్యాటక ప్రదర్శనల్లో ఒకటైన వరల్డ్ ట్రావెల్ మార్కెట్-2026లో తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసింది. లండన్‌లో జరుగుతున్న ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌ను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నిన్న ప్రారంభించారు. ఈ పెవిలియన్‌లో తెలంగాణలోని రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, చార్మినార్, బుద్ధవనం, లక్నవరం, బొగత జలపాతం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలతో పాటు తెలంగాణ చేనేత, హస్తకళలను ఈ పెవిలియన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి స్థానిక మిలటరీ అథారిటీగా పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సైనిక దళాలకు పూర్తి సహకారం అందిస్తామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

==========